కేంద్ర మంత్రి అమిత్ షా గో బ్యాక్ ... గో బ్యాక్....

విశాలాంధ్ర - చోడవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ గో బ్యాక్ అంటూ సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. చోడవరం కొత్తూరు జంక్షన్ లోని గాంధీ విగ్రహం వద్ద ఆదివారం కమ్యూనిస్టు పార్టీ శ్రేణులతో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను విమర్శించడం, మాట్లాడే విధానాన్ని తప్పు పట్టారు. భారత రాజ్యాంగం చైర్మన్‌గా రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన అంబేద్కర్‌ను పార్లమెంట్లో అగౌరవంగా మాట్లాడడం, భారత రాజ్యాంగాన్ని అవమాన పరిచినట్టుగా ఉందన్నారు తక్షణమే కేంద్రమంత్రి అమిత్ షా తన మాటలను వెనక్కి తీసుకొని, పార్లమెంట్ సాక్షిగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి రమణ, ఆతవ సురేష్, మేరపు రెడ్డి శీను, ఖండేలా వెంకట్రావు, అప్పన్న, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెదరామభద్రపురంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెద రామభద్రపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దళిత కాలనీలో బిజెపి నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, పిఎంజెకేకేవై రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బొల్లవరపు రత్న భరత్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ఆచంట శ్రీకాంత్, కలిగట్ల మూలస్వామి, దాసరి జగదీష్, వేముల వెంకటరమణ, కాకర్లపూడి శివరామరాజు, పిల్లి రాంబాబు, యాదాల శ్రీను, బోడపాటి ఇందిర, యాళ్ల శ్రీనివాస్, యాళ్ల నూకరత్న%శీ%, యాళ్ల నూకరాజు, తాడి తాత, బీర చిన్న, యాళ్ల కృష్ణ, ఏనుగుపల్లి వీర లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అవినీతిపై విచారణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - రోలుగుంట: గత ఏడాదిన్నరగా జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకపై ఫిర్యాదులు చేస్తున్నా నేటికీ సంబంధిత శాఖ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టలేదని తక్షణమే దర్యాప్తు చేపట్టి అవినీతిపై నిగ్గుతేల్చాలని సొసైటీ ప్రభ్యులు కిల్లాడ సాంభ మూర్తి, గొల్లు నారాయణరావులు డిమాండ్ చేశారు. ఆదివారం రోలుగుంటలో విలేకరుల సమాశంలో మాట్లాడారు. అవకతవకలపై సెక్షన్ 51 క్రింద విచారణ చేయాలని ఆ శాఖ డిప్యూటీ రిజిస్టర్ ప్రేమ స్వరూపరాణి ఉత్తర్వులు జారీ చేసి 15 రోజులు దాటినా నేటికి ఎటువంటి విచారణ చేపట్టలేదన్నారు. సంబంధిత శాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పీఏసీఎస్ సీఈఓ పాత్ర ఉందన్నారు. సంఘంలో కాల పరిమితి అయిపోయిన రుణాలను రికార్డులను తారుమారు చేసి సంఘ సభ్యులకు తెలియపరచకుండా అసలులో రూ.100లు కట్టి రుణాలను బ్రతికించి వాటిపై దావాలు వేసి జప్తు నోటీసులు సంఘం సభ్యులకు పంపించి భయభ్రాంతులకు గురిచేసి సొమ్ములు వసూళ్లు చేస్తున్నారన్నారు. రుణాలు తీసుకోకపోయినా రుణాలు తీసుకున్నట్లు కట్టమని జప్తు నోటీసులు పంపడం బినామీల పేర్ల మీద రుణాలు పొందడం కొంతమంది రైతులకు భూమి లేకపోయినా తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు తీసేసుకుని కట్టమని నోటీసులు పంపడం ఎప్పుడో 20 ఏళ్ల క్రితం చేసుకున్న రుణాలు చెల్లించినా నేడు కట్టమని నోటీసులు పంపడం వెనుక జానకిరాంపురం కోపరేటివ్ సొసైటీలో భారీ అవినీతి చోటుచేసుకుందని దీనిపై తక్షణమే విచారణ చేపట్టాలన్నారు.

కొనసాగుతున్న మారిటైం యూనివర్సిటీ నిర్వాసితుల రిలే దీక్షలు

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో మారిటైమ్ యూనివర్సిటీకి భూమిలిచ్చిన రైతులు తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గ్రామ అభివృద్ధి పనులు చేపట్టాలని నిరవధిక దీక్షలు శనివారం ప్రారంభించారు. ఈ దీక్షలను రెండో రోజు ఆదివారం కూడా రైతులు కొనసాగించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు వంగలి రైతులకు సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ, మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు, కూటమి నేతలు దొడ్డి సూర్య ప్రకాష్‌రావు, బొడ్డపల్లి సూరిదేముడు, కల్లేపల్లి ఎర్నిబాబు తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని వంగలి రైతులకు తెలిపారు. అయితే మారిటైమ్ యూనివర్సిటీ యాజమాన్యం స్థానిక ఎమ్మెల్యేతో చర్చలు జరిపి రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అపాయింట్మెంట్ కోసం ప్రయత్నించగా, ఎమ్మెల్యే పంచకర్ల సోమవారం చర్చలకు అపాయింట్మెంట్ ఇచ్చినట్లుగా యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. రైతులు రెండో రోజు కూడా యూనివర్సిటీ ఎదుట వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీ హేమ గణేష్, జెట్టి ప్రసాదు, జెట్టి హేమంత్, జెట్టి పెంటారావు, జెట్టి ముత్యాల నాయుడు, ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు, గొర్లి కోటేశ్వరరావు, ముమ్మన అప్పలరాజు, కందా కనకరాజు, కందా రాము, జెట్టి శ్రీను, జెట్టి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేములపూడిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మండలం వేములపూడి - పద్మనాభుని బెన్నయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007- 2008 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్న వారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు స్థలాన్ని అందించిన స్థల దాత పద్మనాభుని బెన్నయ్య శెట్టితో పాటు పూర్వపు ఉపాధ్యాయులను విద్యార్థులందరూ ఘనంగా సన్మానించారు. అనంతరం వేములపూడి పాఠశాలకు ఇన్వర్టర్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సోమవారం ఉదయం 9గంటలకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభిస్తారని ఈ కార్యక్రమన్ని జయప్రదం చేయాలని పెదగొగాడ పశువైద్యాధికారిణి కేవియస్ రాఘవమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందులు, కోళ్ళు, గొర్రెలు, మేకలకు టీకాలు, గర్భ కోశ వ్యాధి చికిత్స చూలు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గొటివాడలో సీతారాముల తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం పిఎసిఎస్ మాజీ చైర్మన్ బొండా సత్యారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుండి సీతారాములకి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ మాజీ చైర్మన్ బొండా సత్యారావు, ఎంపీటీసీ బోండా శేష కుమారి, మాజీ సర్పంచ్ వడిసెల రమేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు సొలాపు సూరిబాబు పాల్గొని సీతారాములను దర్శించుకొని భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సాముగరిడీలు, చిటికెల భజనలతో, తీన్మార్ డబ్బులతో, మందు గుండు సామగ్రితో, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా తీర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని లాలం కొత్తూరు గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసామని సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆదివారం తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందికి సూచించిన మేరకు కోడిపందేల స్థావరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో రెండు కోడి పుంజులు, 1150 నగదు స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై మనోజ్ కుమార్, రైటర్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తీడ గ్రామ శివారులో గుళ్ళు ఆట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు కట్టినట్టు సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. శనివారం రాత్రి తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలసి గుళ్ళు ఆటలు ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో 6 గుళ్ళు, ఒక నెంబర్ పట్టా, వారి వద్ద నుండి 3210 నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - అచ్యుతాపురం: లాలం కోడూరు ఉన్నత పాఠశాలలో 1994 - 1995లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కొండకర్లలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న సమయంలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజాన విజయ్ ఉన్నారు.

రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎమ్మెల్యే సుందరపు

విశాలంధ్ర - అచ్యుతాపురం: రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎన్నికలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలకు చెందిన క్రీడా అసోసియేషన్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ద ఒలింపిక్ అసోసియేషన్ విశాఖ సభ్యులు ఎమ్మెల్యే గణబాబు, ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, ప్రధాన కార్యదర్శి కంచరణ సూర్యనారాయణ, కోశాధికారి మోహన్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అబ్జర్వర్‌గా విష్ణు, సాప్ అబ్జర్వర్ జాన్ గాలియత్, ఏపీ ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ మోహన్ వెంకట్రావు, ఎలక్షన్ ఆఫీసర్ అడ్వకేట్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ పీలా తులసీరామ్ అన్నారు. ఆదివారం మండలంలో ఖాజీపాలెం గ్రామంలో అనకాపల్లికి చెందిన భువనేశ్వరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పీలా సందీప్, పీలా నాగశ్రీను, కోటి, సాయి, రమేష్, వరదరాజు, వంశీ, రాము గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ 29వ వర్ధంతి తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి తీర్థ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మళ్ల శేషు, వాడ్రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

సగర్ల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండలం ఏపీ పురం పంచాయతీ ఉప్పరగూడెం గ్రామంలో సగర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ హాజరయ్యారు. ఈ మేరకు వైసీపీ నుండి నక్క రాంబాబు కుటుంబం టీడీపీలో చేరారు. అనంతరం విజయ్ భగీరథ మహర్షి విగ్రహానికి, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ్ మాట్లాడుతూ ఉప్పరగూడెం ప్రజల చూపించే అభిమానం అమూల్యమని, ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ అనంతరం ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గనడం ఆనందంగా ఉంటుందని చెప్పారు. అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త సక్క అచ్చియ్య కుటుంబానికి విజయ్ తమ వ్యక్తిగత నిధులు రూ.1.50లక్షలు అందించి, ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ

కార్యక్రమంలో తాండవ చైర్మన్ కారక సత్యనారాయణ, తాండవ వైస్ చైర్మన్ మేడప రెడ్డి జోగిబాబు, సగర్ల సాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు, అనకాపల్లి జిల్లా సెక్రటరీ నక్క రమణ, సర్పంచ్ పైల రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రామచంద్ర, ఎంపీటీసీ లోక లావరాజు, యువ నాయకులు వెలగా వెంకట కృష్ణారావు, పారుపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు

విశాలాంధ్ర - అనకాపల్లి: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గల నెహ్రూ చౌక్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అధ్యక్షతన జరిగిన నిరసనలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అణగారిన కులాలను అణగదొక్కడం తగదని, ఇది కేవలం వామపక్షాల సమస్యే కాదని, దేశ ప్రజల సమస్యని, ప్రజలందరూ తమ పోరాటానికి మద్దతు నివ్వాలని కోరారు. ఈ వివాదంపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు నిందలు వేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుంటే రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రతి పక్షనేత జగన్ ఈ అంశంపై నోరు తెరవక పోవడం శోచనీయమన్నారు. సనాతన ధర్మమంటే అంబేద్కర్‌ని, రాజ్యాంగాన్ని అవమానించడమా? మోడీ నియంతృత్వాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దడమా? అని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని ప్రకటించారని, ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం 240 సీట్లకే పరిమితం చేశారని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణకు లౌకిక ప్రజా తంత్రవాదులు నిలబడాలని రాష్ట్రంలో అమిత్ షా పర్యటించే హక్కు లేదని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. ఉమా మహేశ్వరావు, డి.డి వరలక్ష్మి, నాయకులు జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, కె.తేల్లయ్యబాబు, డి.శ్రీనివాసరావు, ఎస్.వి. నాయుడు, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ సర్పంచ్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో వైసీపీ నుంచి జనసేనలోకి పలువురు చేరారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో వైసీపీకి చెందిన చోడపల్లి సర్పంచ్ గండిబోయిన భానువెంకట్, ఉప సర్పంచ్ గురునాథ్ వార్డు మెంబర్లుతోపాటు సుమారు 30 మంది నాయకులు జనసేన పార్టీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూడిమడక జనసేన నాయకులు మేరుగు ప్రవీణ్ కుమార్, పోలవరపు పారునాయుడు, సూరడ ధనరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌ను గాడిలో పెడతాం

- 21 నుండి రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభం
- హామీలిచ్చిన చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని సహకార రంగంలో నడుస్తున్న చక్కెర మిల్లులు అన్నింటిలో అగ్రగామిగా పేరొందిన ది. చోడవరం కో ఆపరేటివ్ సుగర్స్ (గోవాడ)ను గాడిలో పెట్టే బాధ్యత తమదని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిలు హామీ ఇచ్చారు. గోవాడ సుగర్స్ అతిథి గృహంలో ఆదివారం ఎం.డి, కార్మికులతో వారు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు వేతన బకాయిలు వారం రోజుల్లోగా చెల్లిస్తామని గోవాడ సుగర్స్‌కు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ఫ్యాక్టరీ ఎం.డి, వివిధ విభాగాల అధికారులతో ఆర్థిక పరిస్థితులపై చర్చించారు. ఈనెల 21న విజయవాడ వెళ్లి ట్రాన్స్‌కో సీఎండీ కలిసి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం విశాఖ ఉమ్మడి జిల్లాలో తాండవ ఏటికొప్పాక ఫ్యాక్టరీలు మూతపడగా చెరకు రైతులకు గోవాడ ఫ్యాక్టరీ అండగా నిలుస్తుంది అన్నారు. కార్మికులకు రూ.6 కోట్లు, సభ్య రైతులకు రూ. 3 కోట్లు వరకు బకాయిలు ఉన్నట్లు ఫ్యాక్టరీ అధికారులు తెలియజేశారు.

కార్మికులు, కర్షకులు బకాయిలు చెల్లించేందుకు ఎం.పీ సీ.ఎం రమేష్ సహాయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఎం.డి. మాట్లాడుతూ ఈ నెల 21న నుండి రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభిస్తామని తెలియజేశారు. ఇప్పటికే ఫీల్డ్ సిబ్బంది రైతాంగానికి కటింగ్ ఆర్డర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో వలె కార్మికులు, కర్షకులు ఫ్యాక్టరీలో క్రషింగ్ సజావుగా నడిపేందుకు సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఉద్యోగ సంఘ నాయకుడు కె.భాస్కరరావు, శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు, ఏ. జగన్నాథరావు, బండి శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమోదకొండమ్మ అమ్మవారికి 10వేల విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామ దేవత శ్రీమోదకొండమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన పైల జోగినాయుడు వారి జ్ఞాపకార్థం వారి భార్య గంగతల్లి కుమారుడు పైలా కొండలరావు (న్యాయవాది) భార్య కమల అమ్మవారికి వెండి నిమిత్తం రూ.10వేలను ఆలయ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ముమ్మిన రమణబాబు, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి తీర్థం

విశాలాంధ్ర - రాంబిల్లి: ధర్మవరంలో కొలువైయున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, ప్రముఖులు అమ్మవారికి దర్శనానికి వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పప్పల చలపతిరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్ళా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అరేపు గుప్తా,మున్సిపల్ కమీషనర్ బి.ప్రసాద్ రాజు, మాజీ ఎంపిపి బొద్దపు ఎర్రయ్య దొర, జనసేన, టిడిపి పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె నానాజీ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ప్రతీ ఏటా వలె బేబీ క్యాటరింగ్ ప్రొప్రైటర్ నానాజీ ఆధ్వర్యంలో అఖండ అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనానికి, తీర్థ మహోత్సవానికి వచ్చిన భక్తులలో సుమారు 30వేల మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. తీర్థ మహోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొఠారు సాంబ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ దనుంజేయులు ఆధ్వర్యంలో 5 మంది ఎస్సైలతో కలిపి మొత్తం 50 మందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర - సబ్బవరం: పార్లమెంటు సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ, సాయినగర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలని కోరారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బీజేపీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా రాజ్యాంగ దినోత్సవం రోజునే అంబేద్కర్ పేరు ఉచ్చరించవద్దనడం సిగ్గు చేటన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు ఉగ్రవాద చర్యలు ప్రేరేపించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుంటే రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రతి పక్షనేత జగన్ ఈ అంశంపై నోరు తెరవకపోవడం శోచనీయమన్నారు. సనాతన ధర్మమంటే అంబేద్కర్‌ని, రాజ్యాంగాన్ని అవమానించడమా? మోడీ నియంతృత్వాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దడమా? అని ప్రశ్నించారు. అంబేద్కర్‌ను కించపరచడంతో బిజెపి నిజస్వరూపం, ఆర్ఎస్ఎస్ ఉద్దేశం ఏమిటో బయట పడిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బిజెపి పని చేస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు లౌకిక ప్రజాతంత్రవాదులు నిలబడాలని రాష్ట్రంలో అమిత్ షా పర్యటించే హక్కు లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.గౌరేష్, కె.కోటి, వై.సోంబాబు, రామనాయుడు, కోటి, అంబేద్కర్ సేవా సంఘం యూత్, తదితరులు పాల్గొన్నారు.